క్లుప్తంగా

ఆదిశిలా వాసుడికి వెండి చెంబు వితరణ



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ శ్రీల క్ష్మీవేంకటేశ్వర స్వామివారికి శనివారం గద్వాల పట్టణానికి చెందిన భక్తుడు దాత ప్రదీప్‌కుమార్, నిర్మల దంపతులు వెండి చెంబును వితరణ చేశారు. ఈసందర్భంగా దాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు దాతలకు పూలమాలతో సత్కరించి శేషవస్త్రం బహుకరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, అరవిందరావు, దీరేంద్రదాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టైం స్కేల్ వర్తింపజేయండి

అలంపూర్: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మెల్సీ కవిత శనివారం అలంపూర్ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ 2022 మార్చి 9న అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించినట్లు వినతిలో పేర్కొన్నారు. ఈనెల 6న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించినట్లు తెలిపారు. గ్రామీణ అభివృద్ధి శాఖలో పనిచేస్తున్న రెండో విభాగమైన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులకు ప్రకటనలో స్థానం కల్పించలేదని అన్నారు. టైం స్కేల్ వర్తింపజేయడానికి సీఎం కేసీఆర్‌తో మాట్లాడాలని వినతిలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీపీ చంద్రకళ, ఈసీ రామకృష్ణ, టీఓ రాజు, తిక్కయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నేడు రక్తదాన శిబిరం

రాజోళి: మండల కేంద్రంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జై శ్రీరామ్ సేవా సమితి ఓ ప్రకటనలో తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామ పెద్దలు, జై శ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

జీపీ ట్రాక్టర్‌తో ఇసుక తరలింపు



ఉండవెల్లి: మండలంలోని కలుగోట్లలోని గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని గ్రామస్తులు వాట్సాప్ గ్రూపులలో మేసేజ్ చక్కర్లు కొడుతుంది. శనివారం గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను సొంత పనులకు అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు వాట్సాప్‌లో పంపించారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డిని వివరణ కోరగా సమాచారం తెలుసుకుని తగిన చర్యలు తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

బీటీగా మారేదెన్నడో?



అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం దక్కడం లేదు. సుమారు ఐదున్నర కిలోమీటర్ల మట్టి రహదారికి బీటీ కోసం ప్రభుత్వం పలు దఫాలుగా నిధులను మంజూరు చేయడం, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధులు సరిపోవని వెనక్కి వెళ్లడంతో పరిపాటిగా మారింది. ఇరు గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగపడే రహదారి కావడంతో దానిని బాగు చేయాలంటూ ఇరు గ్రామాల రైతులు సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యేకు వేడుకుంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టు అధిక భాగం ఇరుగ్రామాల మధ్య ఉండటంతో ఎత్తిపోతల సంఘం డైరెక్టర్లు, రైతులు రహదారిని సీసీగా మార్చమంటూ పీజేపీ అధికారులకు గతంలో విన్నవించారు. రైతుల విన్నపానికి స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చి పరిస్థితులను అంచనా వేశారు. ఇటు ఇరిగేషన్, అటు పీఆర్ అధికారులైన కచ్చ రహదాని రూపు రేఖలు మార్చాలంటూ రైతులు కోరుతున్నారు.



అమరవాయిలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



అయిజ గుంతరామలింగేశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు

కిటకిటలాడిన ఆలయాలు

కేటీదొడ్డి: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కుచినెర్లలో శనివారం అడివిస్వామి ఆలయం, శివాలయంలో శంబులింగుస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించి, పల్లకీ సేవ చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచ్ హైమవతి, అడివిస్వామి, శరణప్ప, పట్టయ్య, సదాశివరెడ్డి, ప్రసాద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, గురుస్వామి, పాల్గొన్నారు.

మల్దకల్‌లో..

మల్దకల్: మండలంలోని అమరవాయి, బిజ్వారం, ఎల్కూరు, కుర్తిరావులచెర్వు, తాటికుంట, శేషంపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్ప , శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శివ మాలధారణ చేసిన భక్తులు ఇరుముడితో శ్రీశైలానికి వెళ్లి స్వామి వారికి మొక్కులు సమర్పించి స్వగ్రామాలకు చేరుకున్నారు. రాత్రి నందికోళ్లసేవతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల్లో అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి ఉన్నారు.



మానవపాడులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మానవపాడు: మండలంలోని నారాయణపురం, అమరవాయి, కలుకుంట్ల, చెన్నిపాడు, మానవపాడు తదితర గ్రామాల్లో శనివారం మహాశివరాత్రి వేడుకలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీపారాధన, గణపతిపూజ, స్వస్తి, పుణ్యహవచనం, హోమం నిర్వహించారు.

శాంతినగర్: మహాశివరాత్రి వేడుకలను వడ్డేపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం తిలకిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. అంతేగాక శనిత్రయోదశి రావడంతో భక్తులు శనైశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిల, తైలాభిషేకాలు, నువ్వుల నూనెతో ప్రత్యేక దీపాలు వెలిగించి, నల్లని వస్త్రాలు, నీలం పుష్పాలు సమర్పించి శనైశ్వరస్వామికి మొక్కులు తీర్చుకున్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తుంగభద్ర నది మధ్యలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పుట్టీల్లో వెళ్లి అభిషేకాలు చేశారు.

అయిజ: పట్టణంతో పాటు వివిధ శివాలయాల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అయిజ: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణంను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



సింధనూరులో కల్యాణానికి హాజరైన భక్తులు



శాంతినగర్‌లో పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



రాజోళిలో అన్నదానం చేస్తున్న భక్తులు





కుచినెర్లలో స్వామివారి పల్లకీ సేవలో భక్తులు, సింధనూరులో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

జోడెద్దుల బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న డీకే అరుణ

గద్వాల : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జోడెద్దుల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం జిల్లా కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కబీర్‌దాస్ నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన పాలపళ్ల విభాగం జోడెద్దుల బండలాగుడు పోటీలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే బండలాగుడు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల వల్ల రైతులలో స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత, బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండల వెంకట్రాములు, రామంజనేయులు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురారి సోమశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన వృషభ యజమానులకు నగదు బహుమతులను అందజేశారు.

కొంకలలో సర్పంచ్ అంత్యక్రియలు



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల సర్పంచ్ వరలక్ష్మమ్మ అంత్యక్రియలు శనివారం స్వగ్రామం కొంకలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బంధువులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు కొనసాగాయి. సర్పంచ్ పార్థివ దేహానికి మాజీ మంత్రి డీకే.సమరసింహారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ భర్త మాజీ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, కుమారులు రాఘవేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుమార్తె రాధికలను మాజీ మంత్రి ఓదార్చారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొని సర్పంచ్ పాడె మోశారు.

ధ్యానంతో ఆరోగ్యం

అయిజ: మానసిక, శారీరక ఆరోగ్యం ధ్యానంతో సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు అన్నారు. శనివారం పట్టణంలో శివాంజనేయ పిరమిడ్ ధ్యాన శక్తి మహా క్షేత్రం నిర్మాణానికి ఆయన రూ. 15,000 నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యాన శక్తి మహా క్షేత్రం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీ సభ్యులు రాముడు, శ్రీనివాసులు, భగత్, పరశురాముడు, ఉపేందర్, నరసింహులు, రవికుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెబ్బేరు: మండలంలోని అయ్యవారిపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో మైనర్లు బైకులు నడపడం, బాల్యవివాహాలు, దొంగతనాలు, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, చిన్నచిన్న గొడవలు, రోడ్డు ప్రమాదాలతో వచ్చే నష్టాలను వివరించారు. కేసులతో కోర్టులు, జైళ్ల చుట్టు తిరిగి జీవితాలను నాశనం చేసుకోకూడదనిఎస్ఐ జగదీష్‌రెడ్డి సూచించారు.సర్పంచ్ స్వాతిగౌడ్, ఉప సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అయిజ: క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలని బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను క్రీడా నిర్వాహకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తాలో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయి చంద్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహా శివరాత్రిని పురస్కరించుకొని అలంపూర్ జోగుళాంబ ఆలయ దర్శనానికి వెళ్తున్న ఆమెకు ఎర్రవల్లి చౌరస్తాలో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వారి వెంట నాయకులు తిరుపతయ్య, కుర్వ పల్లయ్య, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు

విద్యుత్ పరికరాల కొనుగోలులో అవినీతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ ముస్లిం కమిటీ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయా వార్డుల్లో, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అవినితి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్, తౌఫిక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2020, 2021, 2022 సంవత్సరాల్లో కొనుగోలు చేసిన విద్యుత్ పరికరాలు తీగలు, వీధి దీపాలు, స్విచ్‌లు, బోర్డులు, ఫ్యానులు, ట్యూబులు, వాటర్ సరఫరాకు ప్లంబింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. మున్సిపాలిటీ ద్వారా విద్యుత్ పరికరాల కొనుగోలు కోసం టెండర్ వేయకుండా బయట కొనుగోలు చేసి రూ.లక్షల్లో అవినీతి చేశారని ఆరోపించారు. వీటికి సంబంధించిన కొనుగోలు రశీదులు తమకు సమాచార చట్టం ద్వారా ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిచామని తెలిపారు. పక్షం రోజుల్లో విద్యుత్ పరికరాల కొనుగోలుకు సంబంధించిన బిల్లుల జిరాక్స్ కాపీలను ఇవ్వాలన్నారు. వీటికి అయ్యే ఖర్చులను మున్సిపల్‌కు చెల్లిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆషు, ఖాసీం, అక్బర్, ఖాదర్, అబీద్, సద్దాం పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో సేవా సంస్థలు



అల్పాహారం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



భక్తులకు అల్పాహారం అందిస్తున్న వివేకానంద యూత్ సభ్యులు

అలంపూర్: మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దక్షిణకాశీ అలంపూర్ క్షేత్రం భక్త జనసందోహంతో కిక్కిరిసింది. వేలాది మంది భక్తులు తరలొచ్చి శ్రీబాలబ్రహ్మేశ్వరుడిని, శ్రీజోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. బాలబ్రహ్మేశ్వరుడిని దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులకు స్వచ్ఛంద సంస్థలు పలు సేవలందించారు. ప్రధానంగా ఉపవాసంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అల్పాహారం, తాగు నీరు, పండ్లు ఉచితంగా అందజేశారు. పట్టణ ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ సముదాయంలోని తుంభద్ర పుష్కర ఘాట్ వద్ద అల్పాహారం అందజేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మహాశివరాత్రికి అల్పాహారం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారాన్ని అందజేశారు. వీటితోపాటు పలు సేవా, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తమ సంస్థల ద్వారా ఆదాయన్ని సమకూర్చుకొని భక్తులకు ఉచిత సేవలు అందించారు. వీరితోపాటు వలంటీర్లు సైతం క్యూలైన్ల వద్ద, వృద్ధులను, దివ్యాంగులను స్వామి, అమ్మవారి దర్శనాలకు వెళ్లడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించారు.

క్రీడాకారులకు సామగ్రి అందజేత



క్రీడాకారులకు వాలీబాల్స్‌ను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

అమరచింత: ప్రతి నిత్యం క్రీడాకారులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించి తమ లక్ష్యసాధనలో ముందుకు సాగాలని మక్తల్ బీఆర్ఎస్ నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి నిత్యం వివిధ క్రీడల్లో పాల్గొంటూ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు మైదానంలో సరైన సౌకర్యాలు లేవనే విషయాన్ని స్వయంగా మైదాన పరిశీలనకు వెళ్లిన వర్కటం జగన్నాథ్‌రెడ్డికి క్రీడాకారులు తమ సమస్యలను తెలియచేశారు. దీంతో క్రీడాకారుల విన్నపం మేరకు స్పందించిన వర్కటం జగన్నాథ్‌రెడ్డి రూ.45 వేల వ్యయంతో నాలుగు ఎల్ఈడీ బల్బులు, 4 వాలీబాల్స్ శనివారం క్రీడాకారులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజల అవసరాలను గుర్తించి వాటిని అందించటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడం, పదో తరగతి వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించామని తెలిపారు.

సామాజిక సేవ చేయాలి

యువకులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. విద్యార్థులకు, క్రీడాకారులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులు జగన్నాథ్‌రెడ్డికి శాలువ, పూలమాలతో సత్కరించారు. తమ సమస్యను తెలుసుకొని పరిష్కరించడం ఎంతో సంతోషమన్నారు. భవిష్యత్తులో వర్కటం చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, గణేష్, బీమా, మసన్న, ప్రతీష్, దిలీప్, అజయ్, అభినయ్, స్టీవెన్, సాయి విజయ్, స్వరాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ఇలా.. మొక్కలు ఎదిగేది ఎలా?



చంద్రనాయక్ తండాలోని నర్సరీ దుస్థితి

అమరచింత: మండలంలోని చంద్రనాయక్‌తండాలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణలో అధికారులు అలసత్వం కనిపిస్తుంది. గ్రామానికి పది వేల మొక్కలు పెంచాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ ద్వారా ఈజీఎస్ అధికారులు ఆయా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. చంద్రానాయక్‌తండాలో నర్సరీని ఏర్పాటు చేసిన అధికారులు వాటిలో మొక్కలను పెంచాలనే విషయంపై దృష్టిని సారించలేక పోతున్నారు. విత్తనాలు ఖాళీ సంచుల్లో విత్తడం , అవి మొలకెత్తకుంటే మరోమారు విత్తడం వంటి కార్యక్రమాలను చేపట్టలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నర్సరీల్లో మొక్కల పెంపకంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.